క్లుప్తంగా

బొత్స ఝాన్సీకి అభినందనలు



డాక్టర్ బొత్స ఝాన్సీని కలిసిన వైఎస్సార్‌సీపీ నాయకులు

అల్లిపురం: వైఎస్సార్‌సీపీ విశాఖపట్నం లోక్‌సభ ఇన్‌చార్జిగా నియమితులైన బొత్స ఝాన్సీని ఆదివారం పార్టీ నాయకుడు, మాజీ కార్పొరేటర్ బోదిలపాటి ఉమామహేశ్వరరావు, 33వ వార్డు సీనియర్ నాయకులు, మండలాధ్యక్షుడు కర్రి నీలకంఠం, బొడ్డేటి ప్రసాద్ తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

సూపర్ స్పెషాలిటీ బ్లాక్‌లో కొత్త ఐసీయూ ప్రారంభం



కొత్త ఐసీయూను ప్రారంభిస్తున్న డాక్టర్ బుచ్చిరాజు, డాక్టర్ అశోక్‌కుమార్

మహారాణిపేట: కేజీహెచ్ సూపర్ స్పెషాలిటీ బ్లాక్‌లోని యూరాలజీ వార్డులో ఆరు పడకలతో న్యూ ఐసీయూను ఆదివారం ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో యూరాలజీ ఐసీయూ కోసం భావనగర్ వార్డుకు తీసుకొని వెళ్లేవారని, నేడు సూపర్ స్పెషాలిటీ బ్లాక్‌లోనే ఐసీయూ పెట్టడం వల్ల రోగులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో కేజీహెచ్ డీసీహెచ్‌ఆర్‌ఎంవో డాక్టర్ లక్ష్మీ తులసి, అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.విజయలక్ష్మి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

లెనిన్‌కు నివాళి



లెనిన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

అల్లిపురం: సోషలిస్ట్ దేశ వ్యవస్థాపకుడు లెనిన్ శత వర్ధంతి కార్యక్రమం అల్లిపురంలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 1917 అక్టోబర్ విప్లవం విజయవంతానికి కృషి చేసిన మహనీయుడు లెనిన్ అని కొనియాడారు. సోషలిజం వర్ధిల్లాలి.. క్యాపిటలిజం నశించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎ.విమల, జీఎస్‌జే అచ్యుతరావు, ఎస్.కె.రెహమాన్, పి.చంద్రశేఖర్, సీఎస్ క్షేత్రపాల్, కాసులరెడ్డి, నాగభూషణం, టీవీ రావు, అశోక్, భాస్కరరావు పాల్గొన్నారు.

టీఎస్సార్ కాంప్లెక్స్‌లో స్వల్ప అగ్నిప్రమాదం



టీఎస్సార్ కాంప్లెక్స్ పైభాగాన చెలరేగిన మంటలు

అల్లిపురం: టీఎస్సార్ కాంప్లెక్స్‌లో ఆదివారం మధ్యాహ్నం స్వల్ప అగ్నిప్రమాదం సంభవించింది. కాంప్లెక్స్ నాలుగో అంతస్తులో కొందరు ఆకతాయిలు నిప్పు పెట్టడంతో ఉదయం 11.30 గంటల ప్రాంతంలో మంటలు చెలరేగాయి. స్థానికులు గమనించి ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. సూర్యాబాగ్ అగ్నిమాపక శాఖ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. ఈ ప్రమాదంలో ఎటువంటి ఆస్తి, ప్రాణనష్టం జరగలేదని అగ్నిమాపక శాఖ సిబ్బంది తెలిపారు.

రామాలయాలకు 'అయోధ్య' శోభ

- బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ట వేళ.. ప్రత్యేక పూజా కార్యక్రమాలు



అంబికాబాగ్ రామాలయంలో వెలసిన సీతారామ లక్ష్మణ సమేత హనుమత్



విద్యుత్ వెలుగుల్లో సీతారామచంద్రస్వామి ఆలయం



సాలిపేటలో రామాలయం



తాడి వీధిలోని రామాలయం



పాతనగరం లక్ష్మీటాకీస్ జంక్షన్‌లో ఆంజనేయ స్వామి ఆలయం

దాబాగార్డెన్స్: అయోధ్యలో రామ మందిర ప్రారంభోత్సవం, బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్టకు ముహూర్తం సమీపించిన వేళ నగరంలోని రామాలయాలన్నీ మరింత శోభాయమానంగా మారాయి. నియోజకవర్గంలో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసింది. ఎటు చూసినా జైశ్రీరామ్ అంటూ జెండాలు.. నినాదాలు.. పోస్టర్లు దర్శనమిస్తున్నాయి. రామనామాలు.. భక్తి గీతాలతో రామాలయాలు అయోధ్య శోభతో మార్మోగుతున్నాయి.

నేడు విశేష పూజలు

ఈ నెల 22న అయోధ్య రాముడి విగ్రహ ప్రతిష్టాపనను పురస్కరించుకుని మహారాణిపేటలోని అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి ఆలయం, దిబ్బలపాలెం రామాలయం, తాడివీధి, సాలిపేట, చెంగల్రావుపేట, రామజోగిపేట, అల్లిపురం, పెరికివీధి, కోటవీధి, రెల్లివీధి, ప్రకాశరావుపేట, వేంకటేశ్వర మెట్ట తదితర రామాలయాల్లో విశేష పూజలు నిర్వహించనున్నారు. మధ్యాహ్నం అన్నసమారాధనలు జరపనున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సంకీర్తనలు, దీపారాధనలు చేయనున్నారు. ఇప్పటికే నగరంలో రామనామంతో ర్యాలీలు చేశారు.

అంబికాబాగ్ రామాలయంలో అఖండ రామనామ సంకీర్తన.. కనకమహాలక్ష్మి దత్తత దేవాలయమైన మహారాణిపేటలోని అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి ఆలయంలో సోమవారం ఉదయం 6.30 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు అఖండ రామనామ సంకీర్తన చేపట్టనున్నారు. లోక కల్యాణార్థం విశ్వశాంతిని కాంక్షిస్తూ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పెందుర్తి శారదా పీఠాధిపతి స్వరూపనందేంద్ర సరస్వతి మహాస్వామి పర్యవేక్షణలో శ్రీరామ కల్యాణం నిర్వహించనున్నారు. లలిత భక్త మండలిచే లలిత సహస్ర నామం, విష్ణుసహస్ర నామ పారాయణ, సాయంత్రం 7 గంటలకు ఆలయ ప్రాంగణంలో దీపోత్సవం జరపనున్నారు.

కరాసా పోలీస్ క్వార్టర్స్‌లో సీపీ పర్యటన

- మరమ్మతులు చేపట్టాలని ఆదేశం



కరాసా పోలీస్ క్వార్టర్స్ గృహ సముదాయాన్ని పరిశీలిస్తున్న సీపీ రవిశంకర్, అధికారులు

గోపాలపట్నం: మర్రిపాలెం వుడా లేఅవుట్‌లోని కరాసా కొత్త పోలీస్ క్వార్టర్స్‌లో ఆదివారం సీపీ డాక్టర్ రవిశంకర్ పర్యటించారు. ఇక్కడి పోలీస్ గృహ సముదాయాలను సందర్శించారు. ఇళ్ల స్థితిగతులతో పాటు డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించారు. మూడో అంతస్తులో ఉన్న ఇళ్ల సీలింగ్ పాడైందని వాటిని తక్షణమే మరమ్మతులు చేయాలని సూచించారు. డ్రైనేజీ సమస్య పరిష్కరించడంతో పాటు అన్ని భవనాలకు పెయింటింగ్ వేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయన వెంట డీసీపీ-2(లా అండ్ ఆర్డర్) ఆనందరెడ్డి, ఏసీపీలు ఆర్మడ్ రిజర్వ్ అధికారులు ఉన్నారు.

వ్యాయామ ఉపాధ్యాయులకు ప్రత్యేక సెలవులివ్వాలి

విశాఖ విద్య: ఆడుదాం ఆంధ్రా విజయవంతంలో కీలక పాత్ర పోషించిన వ్యాయామ ఉపాధ్యాయులకు ప్రత్యేక సెలవులు ఇవ్వాలని వ్యాయామ ఉపాధ్యాయుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఆముదాల అప్పలరాజు కోరారు. ఆదివారం జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి యువతలో క్రీడా స్ఫూర్తిని నింపేలా ఆడుదాం ఆంధ్రాకు శ్రీకారం చుట్టడం హర్షణీయమన్నారు. ప్రభుత్వ ప్రతిష్టను ఇనుమడింపజేయడానికి ఆడుదాం ఆంధ్రా క్రీడలను విజయవంతం చేయడంలో వ్యాయామ ఉపాధ్యాయులు పాత్ర ఎంతో ఉందన్నారు. వ్యాయామ ఉపాధ్యాయుల సేవలను గుర్తించి సెలవు రోజుల్లో పనిచేసిన కాలానికి ప్రత్యేక సెలవులు మంజూరు చేయాలని కోరారు. సమావేశంలో సంఘం జిల్లా కార్యదర్శి ఎల్. లలితకుమార్, కోశాధికారి ఎస్. రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కోలాహలంగా రామాలయం పరస

- విద్యుద్దీప కాంతులు, జనంతో కళకళలాడిన దొండపర్తి



దొండపర్తి రామాలయం వద్ద గోపూజ చేస్తున్న కమిటీ ప్రతినిధులు



పరసలో సందడి చేస్తున్న భక్తులు



బుర్రకథ ప్రదర్శిస్తున్న కళాకారులు

సీతమ్మధార: జీవీఎంసీ 27వ వార్డు దొండపర్తిలో ఆదివారం రామాలయం పరస కోలాహలంగా జరిగింది. సాయంత్రం రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. రామాలయం వద్ద గోపూజ చేశారు. దొండపర్తి ప్రాంతమంతా విద్యుద్దీప కాంతులతో కళకళలాడింది. చుట్టుపక్కల ఉన్న మద్దిలపాలెం, అక్కయ్యపాలెం, సీతమ్మధార, రైల్వే న్యూకాలనీ, తాటిచెట్లపాలెం, ద్వారకానగర్, సీతంపేట, కంచరపాలెం, మర్రిపాలెం, పెదవాల్తేరు, రేసపువానిపాలెం తదితర ప్రాంతాల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చి పరసలో సందడి చేశారు. సాయంత్రం నుంచి రాత్రి వరకు పురవీధుల్లో సాంస్కృతిక, నృత్య వినోద కార్యక్రమాలు, గరిడీ, బుర్రకథతో సందడిగా మారింది. కార్యక్రమంలో ఎరుకుమాంబ దేవాలయం ట్రస్ట్ చైర్మన్, పార్టీ 27వ వార్డు అధ్యక్షుడు నీలాపు సర్వేశ్వరరెడ్డి, రామాలయ ధర్మకర్తలు చిట్టిబోయిన శివశంకర్ కుమార్, అంగటి కుమారి, ఎస్.మల్లేశ్వరి, అర్చకుడు సుబ్రహ్మణ్యం, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

శ్రీరాముడికి స్వర సమర్పణ




కీర్తనలు ఆలపిస్తున్న శారద సుబ్రహ్మణ్యం శిష్య బృందం

సీతంపేట: గణతంత్ర దినోత్సవం, అయోధ్య శ్రీరామ విగ్రహ ప్రతిష్టాపనలను పురస్కరించుకుని సంస్కార భారతి ఆధ్వర్యంలో ఆదివారం శంకర మఠంలో భరతమాత పూజా దినోత్సవం, డాక్టర్ శారద సుబ్రహ్మణ్యం శిష్య బృందంచే శ్రీరాముడికి స్వర సమర్పణ చేశారు. పలువురు గాయనీ గాయకులు రాముడిని స్తుతిస్తూ కీర్తనలు, రామదాసు ఆలపించిన కీర్తనలు పాడి అలరించారు.

నేడు సింహగిరిపై శాంతి కల్యాణం

సింహాచలం: సింహగిరిపై గంగధార వద్ద ఉన్న పురాతన సీతారామస్వామి ఆలయంలో సోమవారం సీతారాముల శాంతి కల్యాణం నిర్వహిస్తున్నట్టు సింహాచలం దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు ప్రారంభం కానున్న కల్యాణంతో పాటు ఇతర పూజల్లో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఈవో కోరారు.

నేడు సిద్ధేశ్వరానంద మహాస్వామి అవతరణోత్సవం



సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి

సీతంపేట: కుర్తాళం శంకరాచార్య, శ్రీలలితా పీఠాధిపతి జగద్గురు శ్రీసిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి 88వ అవతరణ దినోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్టు పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 9.30 గంటలకు గురువందన సమర్పణ జరుగుతుందన్నారు. అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ట సందర్భంగా సీతారాముల పట్టాభిషేకం, మధ్యాహ్నం 12.30 గంటల నుంచి అన్నప్రసాద వితరణ నిర్వహిస్తామని చెప్పారు. భక్తులు పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

ముగిసిన హోటల్స్ అసోసియేషన్ సమావేశాలు

బీచ్ రోడ్డు: నగరంలోని ఓ హోటల్‌లో మూడు రోజులుగా జరుగుతున్న సౌత్ ఇండియా హోటల్స్ అండ్ రెస్టారెంట్ వార్షిక సమావేశాలు ఆదివారం ముగిశాయి. ఈ ముగింపు వేడుకలకు ఎంపీ జీవీఎల్ నరసింహారావు పాల్గొని పలు అంశాల గురించి చర్చించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు శ్యామ్‌రాజు మాట్లాడుతూ మూడు రోజుల పాటు 35 మంది అనుభవజ్ఞులతో విశాఖలో టూరిజం అభివృద్ధి ప్రభుత్వం సహకారం, సవాళ్లు, పరిష్కారంపై చర్చించామన్నారు. ఈ సమావేశంలో పలు తీర్మానాలు చేశామని, వీటిపై రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అభివృద్ధికి విశేష సేవలందించిన ఆంధ్రప్రదేశ్ హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్.వి.స్వామీని ఘనంగా సత్కరించారు.

అలరించిన హాస్యామృతం షో



కామెడీ స్కిట్ ప్రదర్శిస్తున్న కళాకారులు

సీతంపేట: హాస్యప్రియ కామెడీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో నిర్వహించిన హాస్యామృతం కామెడీ షో ఆద్యంతం నవ్వులు పండించింది. క్లబ్ వ్యవస్థాపకుడు ఇమంది ఈశ్వరరావు పర్యవేక్షణలో పలువురు కళాకారులు అల్లాడి నాగరాజు, సిహెచ్.నాగార్జున, ప్రవీణ్, ఎం.రమ, ఎం.సీత, మల్లిక, పావని తదితరులు ప్రదర్శించిన కామెడీ స్కిట్లు కడుపుబ్బా నవ్వించాయి. వాటిలో టెక్నాలజీ, ఏదైనా సాధిస్తా, నలుగురు పెళ్లాల ముద్దుల మొగుడు, బస్ బే, మాటకోసం ముప్పు తిప్పలు, ఎయిర్ పోర్టు కామెడీ స్కిట్లు ప్రేక్షకులను హాస్యంతో ముంచెత్తాయి.

గీతాభవనంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు



శ్రీకృష్ణ పరమాత్ముడికి ప్రత్యేక పూజలు చేస్తున్న సంస్థ ప్రతినిధులు

దాబాగార్డెన్స్: అయోధ్యలో సోమవారం నిర్వహించనున్న బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ట మహోత్సవం విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ వన్‌టౌన్ రాజప్పనాయుడు వీధిలోని గీతాభవనంలో గీతా ప్రచార సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. సంస్థ అధ్యక్షుడు సీహెచ్ విశ్వేశ్వరరావు సారథ్యంలో వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రి ఆశీస్సులతో ఈ కార్యక్రమాలు చేపట్టారు. ఆలయ అర్చకులు వేదపఠనం చేయగా గీతా ప్రచార సమితి సభ్యులు సామూహికంగా భగవద్గీత శ్లోకాల పారాయణ, శ్రీవిష్ణు సహస్రనామం, శ్రీరామ గాయత్రి, శ్రీరామ రక్షా స్తోత్రం, శ్రీరామనామ సంకీర్తన, హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. విశ్వరూప సహిత శ్రీకృష్ణ పరమాత్ముడికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆధ్యాత్మిక వేత్త ఎంపీ రాజశేఖర్ మాట్లాడుతూ శ్రీరామచంద్రమూర్తి అవతరించిన అయోధ్యలో శ్రీరామ విగ్రహ ప్రతిష్ట జరగడం దేశానికే గర్వకారణమన్నారు. కార్యక్రమంలో వనజాదేవి, జీవీఆర్ ప్రసాద్, జి.లక్ష్మీనరసింహ, కనకవల్లీ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పోలమాంబ జాతర



దాబాగార్డెన్స్: జీవీఎంసీ 30వ వార్డు కుమ్మర వీధిలో వెలసిన బహుముఖ రూపాల పోలమాంబ అమ్మవారి 66వ వార్షిక జాతర మహోత్సవం ఈ నెల 22, 23 తేదీల్లో అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. 22న సోమవారం తొలేళ్ల సంబరం జరపనున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తారు. సాయంత్రం ఆలయ ప్రాంగణం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 23న మంగళవారం పరస మహోత్సవం జరగనుంది. ఆ రోజు సాయంత్రం 6 గంటలకు ఆలయ ప్రాంగణం వద్ద నిప్పుల గుండం, భక్తుల సమక్షంలో ముత్తయిదువులతో ఘటాభిషేక ఉత్సవం, సాయంత్రం 5 గంటల నుంచి పుర వీధుల గుండా ఊరేగింపు, విద్యుత్ దీపాలంకరణ, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు పోలమాంబ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా పౌరాణిక వేషధారణలు, సాముగరడీలు, దాసుళ్ల సందళ్లు, డీజే వాయిద్యాల హోరుతో మహోత్సవాలు నిర్వహించనున్నట్టు చెప్పారు. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 24న బుధవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి పెద్ద ఎత్తున అన్నదానం చేస్తామన్నారు.

అలవోకగా 150 పద్యాల ఆలాపన



డాక్టర్ పెదవీర్రాజును సన్మానిస్తున్న నిర్వాహకులు

మహారాణిపేట: విశాఖ రసజ్ఞ వేదిక ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా పరిషత్ అంకోశ హాల్‌లో తెలుగు పద్య సౌరభం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉదరకోశ వ్యాధుల వైద్య నిపుణుడు డాక్టర్ ఈదర పెదవీర్రాజు ప్రముఖ కవులు రాసిన పద్యాలను అలవోకగా ఆలపించారు. 150 పద్యాలను ఏకధాటిగా చదవి కవులు, రచయితలను ఔరా అనిపించారు. గణనాథుడి పద్యంతో మొదలై 150 పద్యాలు చదవి వినిపించారు. సమకాలిన అంశాలను ఆధారంగా చేసుకొని ఆయన ఇంత వరకు పలు కవితలు రాశారు. తెలుగు భాష, పద్యాలపై తనకున్న పట్టుతో నన్నయ్య, తిక్కన, తిరుపతి వెంకట కవులు, దాశరథి తదితర కవుల నుంచి వచ్చిన పలు పద్యాలను, వాటి సారాంశాన్ని డాక్టర్ పెద వీర్రాజు చదవి వినిపించారు. తెలుగు భాష గొప్పతనాన్ని తనదైన శైలిలో ఆయన వినిపించారు. డాక్టర్ జి.రఘురామారావు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో డాక్టర్ పెద వీర్రాజు, ముఖ్య అతిథి డాక్టర్ మీగడ రామలింగస్వామిలను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు.

వీధి విక్రేతలకు అండగా మోదీ సర్కార్



వీధి విక్రయదారులతో రవీంద్ర

మహారాణిపేట: బీజేపీ విశాఖ జిల్లా ఆధ్వర్యంలో మహారాణిపేటలో ఆదివారం స్ట్రీట్ వెండర్స్ సెల్ (హాకర్స్) సమావేశం జరిగింది. ఈ సందర్భంగా స్ట్రీట్ వెండర్స్ సెల్ కో కన్వీనర్‌గా దాకమర్రి సింహాచలం, భీమిలి నియోజకవర్గ స్ట్రీట్ వెండర్స్ సెల్ కో కన్వీనర్ షేక్ అల్లాబక్ష్, తూర్పు నియోజకవర్గ స్ట్రీట్ వెండర్స్ సెల్ కో కన్వీనర్‌గా ఎ.మణీశ్వరరావులకు బీజేపీ విశాఖ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు రవీంద్ర మేడపాటి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ వీధి విక్రయదారుల వ్యాపార అభివృద్ధి కోసం ముద్ర రుణాలు, పీఎం స్వనిధి పథకం వంటివి ప్రవేశపెట్టారన్నారు. అర్హులందరూ ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర వైద్య విభాగ కన్వీనర్ రూపాకుల రవికుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీరంగం ధనేశ్వరరావు, బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు పీవీవీ ప్రసాదరావు, వీధి విక్రయదారులు నగర ఆహార తోపుడుబండ్ల సంక్షేమ సంఘ అధ్యక్షుడు డి.బాలాజీ, ఇతర నాయకులు సుంకర సురేష్, బండారు రమేష్, వి.శ్రీనివాస రావు, ఎం.శ్రీనివాసరావు, ఆర్.సుందరరావు, శంకర గుప్తా, కొండా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు కుమారుల అప్పగింత



రామసాయిని తండ్రి వేణుగోపాలరావుకి అప్పగిస్తున్న ఏయూటీడీ ప్రతినిధి వాసు



అవినాష్‌కుమార్‌ను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న ఏయూటీడీ సిబ్బంది

అల్లిపురం: మతిస్థిమితం లేకుండా నగరానికి వచ్చిన ఇద్దరిని ఆర్పీఎఫ్ పోలీసులు రెస్క్యూ చేసి జీవీఎంసీ ఏయూటీడీ సిబ్బందికి అప్పగించారు. వారికి కౌన్సెలింగ్ నిర్వహించిన ఏయూటీడీ సిబ్బంది తల్లిదండ్రులను పిలిచి చెంతకు చేర్చారు.

వివరాలిలా..

- జార్ఖండ్ రాష్ట్రం, రాంచీకి చెందిన అవినాష్‌కుమార్ సోను అనే వ్యక్తికి రియల్ ఎస్టేట్‌లో నష్టం రావడంతో మానసిక పరిస్థితి క్షీణించింది. ఈ నెల 19న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా రాంచీ రైల్వే స్టేషన్‌లో ట్రైన్ ఎక్కేశాడు. అతడి బంధువులు చూసి వారి కుటుంబ సభ్యులకు తెలియజేశారు. వారు ఆర్పీఎఫ్ పోలీసులకు ఫిర్యాదు చేయటంతో విశాఖపట్నం ఆర్పీఎఫ్ పోలీసులకు సమాచారం అందజేశారు. విశాఖ ఆర్పీఫ్ పోలీసులు అతడిని గుర్తించి ట్రైన్ నుంచి దింపేసి ఏయూటీడీ సిబ్బందికి సమాచారం అందజేశారు. భీమ్‌నగర్ ఏయూటీడీ సిబ్బంది అతడిని షెల్టర్‌కు తరలించారు. అవినాష్ కుమార్ తండ్రి మనోజ్ సోను, తల్లి సరోజినీ దేవిలను ఏయూటీడీ షెల్టర్‌కు పిలిపించి కొడుకు సోణ/ను అప్పగించారు. ఈ సందర్భంగా వారు ఆర్పీఎఫ్, ఏయూటీడీ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.
- విజయనగరం జిల్లాకు చెందిన రామసాయి అనే బాలుడు మతిస్థిమితం లేక ఇంట్లో నుంచి బయటకు వచ్చేసి విశాఖ రైల్వే స్టేషన్‌లో తిరుగాడుతున్నాడు. అతడిని ఆర్పీఎఫ్ పోలీసులు గుర్తించి జీవీఎంసీ ఏయూటీడీ సిబ్బందికి తెలియజేశారు. టీఎస్సార్ కాంప్లెక్స్ నిరాశ్రయ వసతి గృహానికి తరలించి ఆశ్రయం కల్పించారు. బాలుడి తల్లిదండ్రుల వివరాలు, ఫోన్ నంబర్ తెలుసుకుని వారికి సమాచారం అందజేశారు. బాలుడు తండ్రి వేణుగోపాలరావు ఆదివారం షెల్టర్‌కు రావడంతో రామసాయిని అతడికి అప్పగించారు.